# వణుకు పుట్టిస్తున్న.. వానలు



**ఆందోళనలో నగరవాసులు**

**లోతట్టు ప్రాంతాల్లోకి చేరుతున్న వర్షపు నీరు**

**ప్రతి యేడు ఇదే తంతు**

**తీరు మారని అధికారులు**

**మరో రెండు రోజులు భారీ వర్షాలు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వర్షాకాలం వచ్చిందంటే చాలు వరంగల్ పట్టణంలోని అనేక కాలనీ వాసులకు వణుకు పుడుతోంది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమవుతున్నాయి. ఇళ్లలోకి వరద చేరుతూ స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. నగర శివారులోని ప్రాంతాలనుంచి వస్తున్న వరద ఖిలావరంగల్ మీదుగా ప్రవహిస్తూ శివనగర్, శాంతి నగర్ ప్రాంతాలతోపాటు అండర్ రైల్వే గేట్ లోని అనేక కాలనీలను ముంచెత్తుతోంది. దీంతో వందలాది కుటుంబాలు నిరాశ్రయులుగా మారుతున్నారు. ఇళ్లలోకి మురుగు చేరడంతో ఆహార ధాన్యాలు, వస్తు, సామగ్రి తడిసి అధిక మొత్తంలో నష్టపోతున్నారు.

**విస్తరిస్తున్న నగరం..**

వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలోకి చుట్టు పక్కల గ్రామాలు వచ్చి చేరాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. కొత్త నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. పట్టణ ప్రాంతంలోని భూములకు రెక్కలు రావడంతో ఇక్కడి చెరువులు, కుంటలు, నాలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. దీంతో ముంపు ప్రభావం మరింత పెరుగుతోంది. ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాల్సిన ప్రజా ప్రతినిధులే వారితో అంటకాగడంతో వారి దురాగతాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. నగర పరిధిలో గతంలో ఉన్న వందలాది కుంటలు నేడు నివాస ప్రాంతాలుగా మారాయి. ఇందులో నిరుపేదలు ఆక్రమించుకున్నవి కొన్నైతే భూ కబ్జా దారుల చేతుల్లోకి పోయినవి అంతకు రెట్టింపు ఉంటాయి.

**ముందస్తు చర్యలు శూన్యం..**

ముంపు నివారణ చర్యల్లో భాగంగా చేపట్టిన మురుగు కాలువల నిర్మాణాలు ఆగుతూ..సాగుతున్నాయి. వీటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తే నగర వాసులకు ఉపశమనం దొరుకుతుంది. అయితే కబ్జా దారులతో అంటకాగుతున్న ప్రజా ప్రతినిధులే మురుగు కాలువ పనులు సాఫీగా సాగకుండా అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే విధంగా సిల్ట్ తో నిండుకున్న మురుగు కాలువలను ఎప్పటి కప్పుడు శుభ్రం చేయాల్సి ఉన్నప్పటికీ గ్రేటర్ ఇంజనీరింగ్ అధికారులు సమస్య వచ్చినప్పుడే చూసుకుందామన్నట్లు వ్యవహరిస్తున్నారని, ఇదే నగరంలోని అనేక ప్రాంతాలు ముంపునకు గురికావడానికి కారణంగా మారుతోందంటున్నారు. ఇప్పటికైనా బల్దియా పాలకవర్గం, ఇంజనీరింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకొని నగరాన్ని ముంపు నుంచి కాపాడాలని స్థానికులు వేడుకుంటున్నారు.

**మరో రెండు రోజులు..**

భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. పలు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరా కూడా అంతరాయం ఏర్పడింది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ములుగు జిల్లాలోని వెంకటాపురంలో అత్యధికంగా 109 మి.వీ. వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్లలో 96.8 మి.వీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఖమ్మం, మహబూబ్‌నగర్, మహబూబాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, కరీంనగర్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 40 నుంచి 80 మి.వీ. వర్షపాతం నమోదైంది. పెద్దపల్లి, కరీంనగర్, ములుగు, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, హనుమకొండ, జగిత్యాల, ఖమ్మం, కొత్తగూడెం, నిర్మల్ జిల్లాల్లో ఈరోజు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# మారుమూల గ్రామాల్లో కలెక్టర్, ఎస్పీ పర్యటన



**వరద సహాయక చర్యల పరిశీలన**

**వరంగల్ వాయిస్, పలిమెల/భూపాలపల్లి :** భారీ వర్షాల నేపథ్యంలో ఉప్పొంగుతున్న గోదావరి పరివాహక ప్రాంతాల్లోని భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలో శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి పర్యటించారు. మహదేవ్ పూర్ మండలంలోని పెద్దంపేట వాగు వంతెనను పరిశీలించారు. అక్కడి నుంచి జిల్లాలో అత్యవసర పరిస్థితులలో ఉపయోగించే వాటర్ బోట్ పనితీరును పరిశీలించారు. గోదావరిలో బోటులో ప్రయాణించి వరద ఉధృతిని తెలుసుకున్నారు. అక్కడి నుంచి ఛత్తీస్ ఘడ్ సరిహద్దు మారుమూల గ్రామమైన దమ్మూరులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విస్తృతంగా కురుస్తున్న వర్షాలతో క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి మారుమూల ప్రాంతాలలో పర్యటించడం జరిగిందన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించినప్పుడు అధికారులకు ప్రజలకు మధ్య సత్సంబంధాలు ఏర్పడతాయని, తద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడంతో పాటు విపత్తుల సమయంలో యంత్రాంగం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పలిమెల మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, గిరివికాస్ పథకం ద్వారా బోర్లు మంజూరు చేసినప్పటికీ త్రి పేస్ కరెంట్ సరఫరా లేదని, ప్రభుత్వ పాఠశాలలో ఒక్కరే ఉపాధ్యాయుడు ఉన్నారని దమ్మూరు గ్రామస్థులు జిల్లా కలెక్టర్ కు తెలుపగా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి త్రి పేస్ విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పలిమెల మండల కేంద్రంలో రూ.65 లక్షల వ్యయంతో సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయాలు నిర్మాణం, రూ.1.43కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి టెండర్లు పిలవడం జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. పలిమెల మండల కేంద్రంలో అధికారుల నివాసాల నిర్మాణాలకు స్థల సేకరణ చేసి ప్రతిపాదనల పంపాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

**కంట్రోల్ రూమ్ ఏర్పాటు..**

అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచేందుకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. అత్యవసర సేవలకు 9030632608 కంట్రోల్ రూము 18004251123 నంబర్లు కు కాల్ చేయాలన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు పొలం పనులతోపాటు ప్రజలు గోదావరి తీర ప్రాంతంలోకి స్నానాలకు గాని ఇతర పనులకు గాని వెళ్లరాదన్నారు. పశువులను ఆరుబయట మేతకు వదలొద్దని, జాలర్లు చేపల వేటకు వెళ్లొద్దని ఆయన పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ జిల్లాలోని గోదావరి నదితో పాటు ఇతర వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లాలో 10 మంది సుశిక్షితులైన సిబ్బందితో వాటర్ బోట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ రాం మోహన్ రెడ్డి, తహసీల్దార్ హేమ, ఎంపీడీఓ శ్రీనివాస్, పంచాయతీరాజ్ డీఈ సాయిలు, ఎస్.ఐ లు పవన్, తమాషా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







# పొంగుతున్న వాగులు, చెరువులు

**వరంగల్ వాయిస్, మల్హర్ :** గత ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు చెరువులు నిండు కుండను తలపిస్తున్నాయి. మండలంలోని పలు చెరువులు మత్తడి దూకుతుండగా వాగులు పొంగి పొర్లుతున్నాయి. మల్లారం సమీపంలోని ఆరే వాగు, కొండంపేట సమీపంలోని బొమ్మారపు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు వాగుల నుంచి వచ్చే వర్షపు నీటితోపాటు ఎగువ నుంచి వచ్చే వరదతో భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల సరిహద్దులో ఉన్న మానేరు నదిలో క్రమంగా వరద ఉధృతి పెరుగుతోంది. భారీ వర్షాలతో వ్యవసాయ పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. వర్షాల వల్ల వల్లెంకుంట గ్రామ ఊర చెరువు పూర్తి స్థాయిలో నిండి మత్తడి పడటంతో తహసీల్దార్ రవి కుమార్, ఎంపీడీఓ శ్యామ్ సుందర్ పరిశీలించి అనంతరం లోతట్టు ప్రాంతంలోని కుంభంపల్లె గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.